# హారతి పళ్లెం

నీలకంఠేశ్వర పురి అనే స్థలం, మరియు నీలకంఠేశ్వర పుర రాజకుటుంబం ఆంధ్రప్రదేశ్ పౌరులకందరికీ సుపరిచితం. భారతదేశానకి స్వాతంత్ర్యం వచ్చేముందు ఈ రాజకుటుంబం శూరవీర విక్రాంత విశాల ప్రబల ప్రతాపముగా వుండేది. పాత రోజుల్లో దాదాపు పదిహేనువందల ఎకరాల భూమి ఈ రాజకుటుంబానికి స్థిరాస్థిగా వుండేది. గత శతాబ్దపు చివరి కాలంలో పార్వతీశ్వర మహారాజు అనే వీరపరాక్రముడైన ఒక సుఖలాలసుడు, ఆ రాజ్యపరిపాలన చేసేవాడు. వారికి మొదటి రాణి ద్వారా ఐదుగురు కొడుకులు పుట్టారు. రెండవ రాణి ఇద్దరు రాజకుమార్తెలకు, ఒక రాజ కుమారుడికి జన్మనిచ్చింది. అనంతరం వారు కనకాంబిక అనే అతిలోక సుందరిని యాదృచ్ఛికంగా చూసి, ఆమెను తన మూడవ రాణిగా స్వీకరించారు. కొద్దిరోజుల్లో ఆయన, ఆ సువర్ణసుందరికి బానిస అయిపోయాడు. ఆయనకు, ఆమెపైవున్న అత్యాశక్తితో పాటు, వారి మద్యాపానాశక్తిని కూడా ఆమె పెంచింది. ఆమె ద్వారా, ఒక రాజకుమారుడిని మాత్రమే ఆయన పొందాడు, అని చెప్పేటప్పుడు ఆమెకు రహస్యంగా గాని, బాహాటంగా గానీ, వేరే పిల్లలు పుట్టడం జరిగిందని గాదు అర్థం. ఆమెకు ఎక్కువమంది పిల్లలు కలగాలని వున్నా, ఆమె సుకుమార శరీరం దానికి ఒప్పుకోలేదు. ఆ రాజకుమారుడిని,-- ఆ చంద్రశేఖర రాజకుమారుడిని, ఆమె మహారాజు ఒడినుంచి, తక్కువగానే క్రిందకు దించేది. వారికి వార్ధక్య సహజమైన అస్వస్థతలు కలిగినపుడు చంద్రశేఖర రాజకుమారుడికి పద్దెనిమిదేళ్లు దాటినై. వారి ప్రథమ పుత్రుడైన గంగాధర రాజకుమారుడికి అప్పుడు నలభైమూడేళ్లు. మహారాజు గారి వారసుడిగా తన తనయుడిని ఎంపిక చేయడానికి కనకాంబిక, సర్వోపాయాలు రాత్రి, పగలు ప్రయోగించి చూసింది. కాని, చాలా ధర్మపరుడైన ఆ మహారాజు, తన తృతీయ అర్ధాంగి యొక్క ఆధార్మికమైన అత్యాశకు లొంగిపోలేదు. తిట్టుకోవటాలు, కొట్టుకోవటాలు, ఈసడింపులు, ఊరడింపులు, ఆ రాజకుటుంబంలో దైనందిన సంఘటనలుగా తలఎత్తాయి. ఈ లోపల భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ కారణంగా, పార్వతీశ్వర మహారాజుగారి పరిపాలనాధికారాలు అస్తమించి పోయాయి.

ఇక రాజ్యాధికారిగా, ఒక వారసుని అవసరం లేక పోయింది. తన అధికార పరిధిలో వున్న భూమినంతా భార్యలకు, పిల్లలకు పంచిపెట్టారు. నిజం చెప్పాలంటే అదొక రాజ్యమే కాదు. ఒక జమీందారీ అని చెప్పవచ్చు. ఆ జమీందారీలో వున్న గ్రామాలన భార్యలు, పిల్లలకు పంచిపెట్టాడుగాని, స్వతంత్ర భారత పరిపాలనా వ్యవస్థ క్రింద, వాళ్ళకింక గ్రామాల నుండి పన్నులుగాని, ఇతర ఆదాయంగాని రావడానికి వీలులేదు. గ్రామాల్లో వున్న ఇళ్ళూ, స్థలాలూ, పంటపొలాలు అన్నీ గ్రామస్థుల ఆస్తులు. అందుకే మహారాజాగారి భార్యలు, పిల్లలకు దొరికిన సరియైన ఆస్తులు రాజకుటుంబం యొక్క ప్రైవేట్ ఎస్టేట్లు మాత్రమే. నీలకంఠేశ్వర పురి నుంచి, యాభై మైళ్ల దూరంలో వున్న కైలాసపురి ప్యాలెస్, దాని చుట్టూవున్న స్థలమూ, రెండవ రాణికి, ఆమె ముగ్గురు పిల్లలకు వ్రాసి ఇవ్వడం వల్ల, నీలకంఠేశ్వర పురం ప్యాలెస్ కలహాలనుంచి దూరంగా, హాయిగా బ్రతుకుతున్నారు వాళ్లు. నీలకంఠేశ్వరపురి ప్రధాన రాజభవనము విభజన చేసి, చిన్న భాగము మూడవ రాణికీ, ఆమె కుమారుడికి కేటాయించి, పెద్ద భాగము పెద్దభార్యకు, ఆమె పిల్లలకూ ఇవ్వడం జరిగింది. దానివల్ల ఆ ఇద్దరు భార్యలు వారి పిల్లల మధ్య తగాదాలూ, కొట్లాటలు అవిరామంగా సాగుతూ పోయాయి. పెద్దరాణి ఐదుగురు కొడుకుల్లో, మొదటివాడు, రెండవవాడు, నాల్గవవాడు తమతమ కుటుంబాలతో విదేశాల్లో సౌఖ్యంగా వుండడంవల్ల, వాళ్లకు రాజకుటుంబ రాజకీయాల్లో ఎలాంటి అభిరుచి వుండేది కాదు. సంవత్సారానికి కనీసం ఆరు నెలలపాటు పెద్దరాణి పిల్లల్ని చూడ్డానికి విదేశ సంచారం చేసేవారు. చిన్నరాణికి ఖైదీగా వున్న మహాజుగారి దర్శనం, పెద్దరాణికి అపూర్వంగా లభ్యమయ్యేది. దానివల్ల, విదేశవాస సమయాల్లో మాత్రమే ఆమెకు అసలైన మనశ్శాంతి దొరికేది. అయినా కూడా, ఆ రాజభవనంలో వున్న, తన ఇద్దరి కొడుకుల గురించి, ఆమెకు బాధగా వుండేది. మూడో కొడుకు వైకుంఠనాథుడు, జన్మతః బుద్ధిమాంద్యం కలవాడు. అతని భార్య అమరేశ్వరి క్రోధశీల మరియు కలహప్రియ. రాజభవనంలోని ఎలాంటి తగవులోనైనా ఆమెకు గణనీయమైన వాటా వుంటుంది. ఆమె కనిష్ఠ పుత్రుడైన జయశంకర రాజ కుమారుడికి చిన్నప్పుడు తలిదండ్రుల నుంచి అమితమైన వాత్సల్యం లభించడం వల్ల చదువులో పెద్దగా అతను శ్రద్ధ చూపకపోవటమే కాక, యవ్వనప్రాయం వచ్చేముందే మధ్యపానం, ధూమపానం లాంటివి తన అధ్యయన విషయాలుగా గూడా స్వీకరించాడు. కాని, దుర్వాసుడి వారసుడయిన జయశంకర్ తిట్టడం తక్కువ, కొట్టడం ఎక్కువ - అది అతని అలవాటు. అతని ధర్మపత్ని అయిన ఇందులేఖ మాత్రం చాలా శాంతస్వభావి. మూడో రాణి ఏకైక సంతానమైన చంద్ర శేఖర రాజ కుమారుడికి, పెద్దగా దెబ్బలాడే అలవాటు లేదు. అతనికి, తన తల్లి బుద్ధి అలాగే వచ్చినట్టుంది. స్వంత వక్రబుద్ధి వినియోగించి ఏ విధంగానైనా కొంత లాభం ఆర్జించాలని మాత్రమే కాకుండా, వేరేవాళ్ల మధ్యలో పుల్లలు పెట్టడం అతనికి జన్మతః సిద్ధించిన ఓ మంచి అలవాటు. తల్లి ఉపదేశం, చేసినట్లుగా అనుసరించడం, వాటిలో వున్న గుణపాఠాలు మననం చేసుకోవడం,

ఇలాంటివి హృదయ పూర్వకంగా చేసే సాక్షాత్ మంధర కుమారుడతను. తల్లిలాగే డబ్బు కొరకు ఏలాంటి పని చేయడానికైనా అతను సిద్ధంగా వుండేవాడు.

మూడవ రాణికి దాదాపు బానిసగా వున్న మహారాజు, రోజులు గడుస్తున్న కొద్దీ ఆమె స్వార్థ పూరితమైన నడవడిక చూసి, తనలో తను కుమిలి పోతున్నాడు. మరణదేవత, నాల్గవ భార్యగా తొందరలో వచ్చి, తనను ఆలింగనం చేసుకోవాలని ఆ వయోవృద్ధుడు ప్రార్థిస్తుండేవాడు. చివరకు, 1950 నవంబరు నెల 25వ తేదీ రాత్రి. నిద్రాదేవి ఒడిలో తల పెట్టుకున్న ఆ మహారాజు, తరువాత కళ్లు తెరవలేదు. వారి 85వ జన్మదినము, అంతకు క్రితము రోజే జరిగింది. తన దుఃఖభరితమైన వార్థక్యం నుంచి, అసంఖ్యాక కుటుంబ కలహాలకు మూగ సాక్ష్యం వహించే అసహాయ స్థితినుండి, ఆయనకు విముక్తి లభించింది.

వారు బ్రతికి వున్నంత కాలం, పోలీసు వాళ్లు ఆ రాజభవన ప్రాకారంలోపల కనీసం కాళ్లు కూడా పెట్టేవారు కాదు. అంతఃపుర రహస్యాలు, అంగడి పాటలుగా ఎప్పుడూ బహిర్గతం కాలేదు. కానీ, వారు పరలోక ప్రాప్తి చెందిన తర్వాత, మూడు నెలలలోపల, రాజకుటుంబ సభ్యుల సివిల్, క్రిమినల్ ఫిర్యాదులు రెవెన్యూ ఆఫీసులకు, పోలీసు స్టేషన్లకు మాటి మాటికీ, ఎగరసాగాయి. దానితో స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ -ఇన్‌స్పెక్టర్, అతని సిబ్బంది, తమతమ ఇళ్లల్లో వండుకున్న భోజనం, తమ హోదాకు తగ్గట్టు లేదనే అభిప్రాయానికి రావడం, రాజభవన భోజనములో వుండే అనితర సాధారణమైన రుచి తెలుసుకోవడం జరిగింది. రాజభవనం నుండి ఎలాంటి ఫిర్యా దులూ రాని రోజుల్లో అక్కడ అందరూ జ్వరంతోగాని, అతిసారంతోగాని లేవలేక పడి వున్నారేమో అని స్వయంగా కనుక్కోడానికి ఆ మంచివారైన పోలీసు - రెవెన్యూ అధికారులు వచ్చేవారు. ఒక ఫిర్యాదికి - ఇరుపక్షాలలో వున్న వాళ్ల వంటగదుల్లో తయారవుతున్న భోజన - ఫలహారాలకు వ్యత్యస్త రుచులు వుంటాయని తెలుసుకున్న ఆ ప్రభుత్వాధికారులకు, మూడు సంవత్సరాలకు ముందు భారత దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం యొక్క మధురమైన అర్థం ఏమిటో ఇప్పుడు బోధపడడం మొదల యింది. సకల మానవానారోగ్య స్థితియే తమ పరమ లక్ష్యమని, జ్ఞానోదయం లభించిన వైద్య గణాల్లాగా - ''కనకం మూలం, కామినీమూలం కలహం బహువిధం లోకే సులభం'' అనే వాస్తవావస్థలో గూడా తృప్తి పడకుండా ఆ మూలాలకు రకరకాల ఎరువులు వేసే నల్లకోటు వాళ్లలాగా -- ఖాకీవాళ్లు, కక్కేవాళ్లు, కక్కించే వాళ్లు చూసేవాళ్లు, చూడని వాళ్లు అందరూ రాజభవనం కలహాల్లో ఇరుపక్షాల్లో కలుగ చేసుకుంటూ మత్సర పోటీలకు, పగ తీర్చు కోడానికి వుండే అత్యాశలను పెంచి, పోషించి, పంటను కోసుకోవడానికి కావాల్సిన సన్నాహాలన్నీ చేసేవాళ్లు. బయటవాళ్ల సహాయ సహకారాలు లభించడంతో, రాజభవన కలహాలకు తీక్షణత మరింత తీక్షణ

మైంది. దానితో ఆ రాజకుటుంబ సభ్యులకు భారత న్యాయ వ్యవస్థ ప్రత్యేకత కొద్ది కాలంలోనే తెలిసి పోయింది.

రాజ భవనంలోని ఆహార పానీయాలకు ఆకర్షింపబడిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరభద్రయ్యగారి హెడ్ క్వార్టర్స్ అనౌద్యోగికంగా, అక్కడికి బదిలీ కావడం జరిగింది. కనకాంబికా రాణికి చాలా దగ్గర సంబంధం ఏర్పడిన ఆ యాభైయేళ్ల వాడికి, రాజభోగాలంటే ఏమిటో బాగా అర్థమయింది. రాణికి గూడా - అరవై అయిదేళ్ల రాజశరీరానికి, అర్ధశతాబ్దం మాత్రమే పాతదయిన పోలీసు వాడి దృఢశరీరానికి మధ్యలో వున్న తేడా స్వానుభవంతో సుస్పష్టమయింది. ఒక పోలీసు అధికారి తనకు కొత్త రక్షకుడుగా దొరకడం తన అదృష్టంగా భావించాడు చంద్రశేఖర రాజకుమారుడు. తల్లి, కొడుకు మాత్రమే వున్న ఆచిన్న అసంతుష్ట కుటుంబానికి అధిపతిగా వీరభద్రయ్య రావడంతో ఆ కుటుంబానికి ఒక నవోన్మేషం కలిగింది... సురక్షితత్వం అనే ఒక నూతనశక్తి కలిసొచ్చింది... దేన్నైనా సరే ఎదుర్కోడానికి తగిన ఒక క్రొత్త ధైర్యం ఏర్పడింది. దానితో ఆ అమరేశ్వరి సమర ప్రకృతి యొక్క బాహ్యరూపానికి గణనీయమైన మార్పు ఏర్పడింది. మంచితనానికి మారుపేరైన ఇందులేఖ ఇచ్చే వివేకపూర్ణమైన అభిప్రాయాలు, చేసే అభ్యర్థనలు, వినడం వల్ల కావచ్చు జయశంకర్ అనే నిర్భయశంకర్, తన శీఘ్రకోపానికి కళ్లెం వేయడం తన శరీరానికి మరియు తన వంశప్రతిష్ఠకు ఉత్తమంగా వుంటుందనే నిర్ణయానికి వచ్చాడు. దానితో బాటు, వీరభద్రయ్య అనే పోలీసు అధికారి దృఢ శరీరాన్ని చూడగలిగిన రోజే తన మనస్సు చల్లారుతుందని కూడా అతను అనుకున్నాడు.

దుర్గుణ సంపన్నుడయిన వీరభద్రయ్య కనకాంబికారాణి, చంద్రశేఖర రాజకుమారుల ద్వారా కొన్ని చెడుపనులు చేయించాడు. తత్ఫలితంగా వైకుంఠనాథ రాజకుమారుడి అమరేశ్వరి రాణి, ఇందులేఖాపతి జయశంకర్ రాజకుమారుడు బాధలు పడ్డారు. పార్వతీశ్వర మహారాజు గారు బ్రతికివుండగా తనకు లభించని జయాలు, వీరభద్రయ్య గారి హయాంలో లభించడం కనకాంబికకు ఎంతో ఆనందం కలిగించింది.

రాజభవన ప్రాసాదంలో, ధవళశిలతో నిర్మింపబడిన శివాలయంలో విధిప్రకారంగా ఉదయాస్తమయ పూజలు జరుగుతుంటాయి. రాజకుటుంబ సభ్యులందరూ పూజల్లో పాల్గొనేవారు. ఈ మధ్య, వీరభద్రయ్య అనే ఒక నీచుడు కనకాంబికా రాణితో పాటు ఛాతి విరుచుకొని గుడికి వచ్చే సందర్భాలలో, యితర రాజకుటుంబ సభ్యులందరూ, అమర్షమనే తప్తనిశ్వాసము ఆలయ పరిసరాల్లో విసర్జించి రాజభవనం వైపు ధృత ప్రయాణం చేయడం మామూలుగా జరిగే ఒక అసుఖకరమైన విషయం. ఎన్నో సంవత్సరాలుగా అక్కడ పూజలు జరిపించే వృద్ధ పూజారికి వీరభద్రయ్యను చూడడమే అసహ్యంగా వుండేది. కాని, అతను ఆ ప్రాంతానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కదా! తప్పదు; అతనితో శతృత్వం కొనితెచ్చుకోవడం దేవతలకు సైతం అపాయక

రమే. అతనెప్పుడొచ్చినా పూజారికి కనీసం ఐదురూపాయలు దక్షిణగా ఇచ్చేవాడు. కాని, అందులో ఒక్కరూపాయి కూడా పూజారి తన అవసరానికి వాడుకొనే వాడు కాదు. వచ్చిన డబ్బంతా అక్కడే హుండీలో వేసేవాడు.

ఇప్పుడు వీరభద్రయ్య ప్రయాణం చేసేది రాణిగారి కారులో. కనకాంబికా రాణి నుంచి ఘనంగా కనకం వసూలు చేయడం అతనికి సాధ్యమైంది. దానివల్ల అతని భార్యాపిల్లలకు ఎంతో ఆనందం కల్గింది. అతని భార్యకు, అతను రాణితో సహవాసం చేయడం గురించి కొద్దిగా కూడా విరోధం వుండేది కాదు. రాజకుటుంబంలో, వీరభద్రయ్యకు బంధం ఏర్పడడం అతని మూడుజన్మల సుకృతం అని ఆమె అందరితో సగర్వంగా చెప్పేది.

ఆ శివాలయంలో, చాలా ఖరీదుగల రత్నఖచిత ఆభరణాలు ఎన్నోవున్నాయి. శివుడి సతతాభరణాలైన సర్పాలు అక్కడ, కాపలా కాస్తాయనీ, ఎలాంటి దొంగతనాలు జరగడానికి వీలులేదని ఆ వూరి జనం చెప్పుకునేవారు.

ఆ శివాలయంలో, అత్యంత ఖరీదైన వస్తువు అక్కడ పూజలకు వాడే బంగారు హారతిపళ్లెం. కల్తీలేని బంగారంతో తయారుచేసిన ఆ హారతిపళ్లెం బరువు దాదాపు మూడు, మూడున్నర కిలోలుండేది. దీపారాధనా సమయంలో ఆ పళ్లెం నుండి ప్రసరిస్తూ, కళ్లకు మిరుమిట్లు గొలిపే మెరుపులు వీరభద్రయ్య మస్తిష్కంలో అల్లకల్లోలాలు సృష్టించాయి. చివరకు, అతను ఆ విషయం కనకాంబికా రాణితో చర్చించడం జరిగింది.

హారతిపళ్లెం అక్కడ నుండి కదిలించడం... ఆ దొంగతనానికి పూజారిని అరెస్టు చేయడం... పళ్లాన్ని కరిగించి ఆ బంగారాన్ని బొంబాయికి పంపించడం... దానివల్ల వచ్చిన బోలెడంత డబ్బును ఒక విదేశీ బ్యాంకులో డిపాజిట్టు చేయడం... ఇది అతని బృహత్ ప్రణాళిక.

రాణికి భయమేసింది. కాని, ఇద్దరు పెద్ద రాణులకూ, వాళ్ల సంతానానికి ఎక్కువ భక్త్యాదరణలు ఇచ్చే, ఆ పూజారిని జైలుకు పంపించడానికి వేసిన పథకం ఆమెకు చాలా బాగా నచ్చింది. ఆ ముసలాడు కొంతకాలం కారాగారంలో నరకయాతన అనుభవించాలి. శివాలయంలో పూజారిగా ఒక యువకుడు రావడమే మేలు.

గుడి సింహద్వారంలో మామూలుగా వేళ్లాడుతున్న తాళం చెవుల గుత్తి నుంచి సరియైన తాళం చెవి ఆకారం ఒక సబ్బుపై ముద్రితమైంది... ఒక డూప్లికేటు తాళం చెవి సృష్టింపబడింది... హారతి పళ్లెం మాయమైంది... పోలీసులకు ఫిర్యాదు చేసింది గుండెలు పగిలిన ఆ వృద్ధ పూజారే... అనుమానంపై ఆ పూజారిని కటకటాల వెనక్కి తోయాల్సి వచ్చింది... పెద్దరాణులు, వాళ్లపిల్లలు పూజారి కొరకు ఏడ్చి, ప్రార్థించినా, అభ్యర్థించినా పోలీసుల గుండెలు మాత్రం కరుగలేదు.

ఇవన్నీ జరిగి దాదాపు ఒక వారం అయింది. సంతోషసాగరంలో ఈదులాడుతున్న అంబికా భద్రయ్యా మిథునాలు పూర్ణ చంద్రుడు ఉదయించిన సంధ్యా సమయంలో ప్రారంభించిన మదిరాసేవ దాదపు పది గంటల వరకు కొనసాగింది. వెన్నెల్లో జలకాలాడుతున్న రమణీయ ప్రకృతిని ఆస్వాదించడానికి వాళ్ళిద్దరూ కార్లో బయలు దేరారు. ప్రేమకేళిలో మునిగివున్న, వాళ్ల శకట వేగం మరీ ఎక్కువ కాకున్నా యాభై మైళ్ల కంటే ఎక్కువ వుంది. ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మగతనానికి అంతకంటే తక్కువ స్పీడు సమంజసం కాదు కదా!

ఆకస్మాత్తుగా ఇది జరిగింది.. వాళ్ల అట్టహాసాలు సుఖ శృంగం అంటుకుంటుండగా సీటు వెనకనుంచి, ఒక పాము బుస వాళ్ళిద్దరికి వినిపించింది. ''పాము''- చలితో గడ్డకట్టుకు పోయేటటువంటి ఈ శబ్దం, అంబిక కంపిత అధరాల నుంచి వెలువడగానే వీరభద్రయ్య ధైర్యం నీరుకారి పోయింది. దిగ్భ్రాంతితో అతను తల వెనుకకు తిప్పిచూశాడు. ఆ క్షణంలో వేగంతో వెళుతున్న ఆ కారు, ఒక సరీసృప గమనరీతిని స్వీకరించి, చాలక నియంత్రణాతీతంగా, ఒక పిచ్చిదానివలె, అటు ఇటూ తిరుగుతూ చివరకు ఓ పెద్ద వృక్షాన్ని ఆలింగనం చేసింది.

కనకాంబిక శరీరము అధాటున విండ్ స్క్రీన్‌ను గుద్దుకుంది. ఆ విండ్ స్క్రీన్ ముక్కలు ముక్కలు పగిలి చెల్లాచెదురుగా పడ్డాయి. ఒక నిముషంపాటు రాతి బొమ్మలా ఆమె ఉండిపోయి, తరువాత పాము గుర్తుకువచ్చి ఆమె బయటికివచ్చింది. కారు తలుపులు నాలుగూ వాటంతట అవే తెరుచుకున్నాయి. ఆమె కారు అవతలివైపుకు వెళ్ళి చూడగా, స్పృహతప్పి పడివున్న వీరభద్రయ్య కనిపించాడు. పగిలిన స్టీరింగ్‌లో అతని తల ఇరుక్కుపోయి ఉంది. ఆమె భయంతో అతన్ని లేపటానికి ప్రయత్నించింది గానీ, అతని శరీరాన్ని ఎత్తలేకపోయింది. ఆమె ముఖం పూర్తిగా గాయాలతో నిండి వళ్ళంతా రక్తసిక్తమై పోయింది. ఆమె శరీరం బాధపెడుతూంది. ఆమె చీరకొంగుతో పెదవులపైనా, ముఖంపైన ఉన్నగాయాల్ని తుడిచినా రక్తస్రావం ఆగడంలేదు. ఆమె రోడ్డుపైకి వచ్చి ఇరువైపులా చూసింది. ఆ ప్రాంతం అంతా నిర్జనంగా ఉంది. భయంతో, రానురాను ఎక్కువవుతున్న నొప్పితో ఆమె బిగ్గరగా ఏడవడం ప్రారంభించింది. కానీ ఆమె ఏడుపు అరణ్యరోదనే అయింది. ఎందుకంటే ఆ ప్రాంతంలో జనసంచారం లేదు. ఆమె ఏడుపు చూసి ఆ పూర్ణ చంద్రుడు వెక్కిరిస్తున్నట్లుగా మరింత శోభాయ మానుడైనాడు. దాదాపు ముప్పావు గంట గడిచివుంటుంది ఆ దారిలో ఒక ఎద్దుల బండి రావడం జరిగింది. ఆ బండిలో వున్న ఇద్దరు గ్రామస్థులు వీరభద్రయ్యను బయటకు తీయడానికి ప్రయత్నించారు. కాని ప్రయోజనం శూన్యం. అతని శరీరమంతా రక్తంతో తడిసినట్టుగా వుంది. తన మిత్రుణ్ణి కారుదగ్గర వుంచి, ఆ వృషభశకట సారథి కనకాంబికను బండిలో ఎక్కించుకొని నీలకంఠేశ్వర పురివైపు అతివేగంగా బండిని తోలాడు.

కనకాంబికను నీలకంఠేశ్వర పురంలో ప్రఖ్యాతిగాంచిన ఒక డాక్టరు దగ్గరకు తీసుకవెళ్లారు. గుర్తించడానికి వీలుకాని విధంగా వికృతమైపోయిన రాణి ముఖం చూసి డాక్టరు విభ్రాంతి చెందాడు. ఎంతో కాలంగా ఇతనే రాజభవనం డాక్టరుగా వుంటూ వచ్చాడు. రాణికి కావల్సిన ప్రథమచికిత్స చేసి, ఆమె నిద్రపోవడానికి ఒక ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత, పోలీసువారితో కలసి ఒక ప్రైవేటు వ్యాన్‌లో ప్రమాదస్థలానికి బయలుదేరాడు. వాళ్లు అక్కడికి చేరుకునేసరికి ఉదయం దాదాపు మూడున్నర గంటలు అయింది. వీరభద్రయ్యను, చాలా భద్రంగా కారు నుండి బయటకుతీసి రోడ్డుపైన పడుకోపెట్టి, అతణ్ణి స్పృహలోకి తీసుకరావడానికి ప్రయత్నంచేశాడు. ఆ ప్రయత్నం సఫలం కానందున, వెంటనే వాళ్లు నీలకంఠేశ్వర పురం వైపు ప్రయాణం సాగించారు.

ఇంగ్గండుకు వెళ్లి వైద్యశాస్త్రం అభ్యసించి, ఆంధ్రాకు తిరిగివచ్చిన ఆ డాక్టరును పార్వతీశ్వర మహారాజు రాజభవనం డాక్టరుగా నియమించిన రోజునుండీ, ఆ డాక్ట రుకు, ఆ రాజకుటుంబ సభ్యులందరి పట్లా ఎంతో స్వామిభక్తివుండేది. మహారాజుగారి చివరి రోజుల్లో, స్వర్గారోహణానంతర కాలంలోనూ, ఆ రాజభవనంలో జరుగుతున్న కలహాల గురించి డాక్టరుగారికి చాలా మనస్తాపంగా వుండేది. ఆ రాజభవనంలో, ధూమకేతుగా ప్రవర్తించే వ్యక్తి కనకాంబికనే అని ఆయనకు బాగా తెలుసు. అయినా సరే అవశ్యస్థితిలో వున్న ఆ దుష్టస్త్రీకి ఆయన ఎంతో శ్రద్ధతో శుశ్రూష చేశాడు. ఆమె నాసిక బాగా నలిగిపోయి వుంది. పెదవులు తెగిపోయి కుట్టడానికి కూడా వీలులేని స్థితిలో వున్నాయి. ఆమె కపోలాల్లో, చిబుకంపై కూడా గాయాలయ్యాయి. ముందు కనిపించే మూడు పళ్ళూ దాదాపు వూడిపోయే స్థితిలో వున్నాయి. తనకు సాధ్యమైనం తవరకు, ఆ డాక్టరు ఆమెకు చికిత్స చేశాడు. ఏది ఏమైనా అతి సుందరంగా వుండే కనకాంబికా రాణి యొక్క శేషజీవితం, ఒక కుష్టురోగిలా, కురూపిలా, భీభత్సంగా గడపాల్సివస్తుందని రూఢి చేసుకున్న డాక్టరు కళ్లల్లో కన్నీళ్లు నిలిచాయి. ఆమెకింత ప్లాస్టిక్ సర్జరీ చేయాలంటే విదేశాలకు వెళ్లక తప్పదు. కాని ఎలాంటి సర్జరీ చేసినా ఆమె రూపంలో పెద్దతేడా రావడానికి అవకాశం లేదు.

ఆ డాక్టరు చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా, వీరభద్రయ్య మరుసటి రోజు సాయంత్రం స్పృహలోకి వచ్చాడు. కాని అంతలోపలే అతని భార్య, ఇతర బంధువులు అక్కడకు చేరి ఏడ్చి నానా గందరగోళం చేయడమే కాకుండా, అతని అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు మనసా వాచా చేసి, కర్మణా అనే మూడో ఘట్టం సంభవానంతరం చేసుకోవచ్చని అనుకున్నట్టుగా వున్నారు. స్పృహలోకి వస్తూనే వీరభద్రయ్య, రాణిగారిని గురించి ముందుగా అడగడం జరిగింది.

పదిహేను రోజులలో, రాణి మరియు వీరభద్రయ్యల గాయాలు మానిపోయ్యాయి. రాణిగారి వికృతమైన ముఖం, మొదటిసారి చూసినప్పుడు, వీరభద్రయ్య తనకళ్లను

గట్టిగా మూసుకున్నాడు. ఆ పోలీసువాడి ఏడుపును అంతకు ముందు ఎప్పుడూ, అతని సొంత భార్యకూడా చూడలేదు.

ఒక విషయం అందరికీ అర్థమైపోయింది. ..వీరభద్రయ్య మరణించలేదు గాని, అతని కుడికాలు, కుడిచేయి చచ్చిపోయాయని. ఆ దైన్యస్థితి నుంచి బయట పడాలంటే వైద్యం కంటే ఎక్కువ దైవకృప కావాలని ఇతరులతో పాటు, అశ్రుధారను ఆపుకోలేని వీరభద్రయ్యకు కూడా అనిపించింది.

ఏదైనా ఒక మంచి కార్యం చేయాలనే అత్యాశ అతనిలో ఉద్భవించింది. దాని పరిణామ ఫలంగా...

పోలీసు వాళ్లు ఏదో కారణం చెప్పి, మూసివుంచిన శివాలయాన్ని తెరచి చూడగా, ఓహ్, ఎంత అద్భుతం ..దొంగిలించబడ్డ హారతి పళ్లెం శంకర పాదాల దగ్గరే ప్రత్యక్షమయింది. ఆ మహాద్భుతాన్ని లెక్కలోకి తీసుకొని, పోలీసుస్టేషన్లో నరకయాతనలు అనుభవిస్తున్న వృద్ధ పూజారిని వదిలిపెట్టడం జరిగింది.

కొన్ని నెలల తర్వాత గూడా వీరభద్రయ్య ఆరోగ్యస్థితి ఏమాత్రం మెరుగుపడలేదు. స్వయంగా ఉద్యోగ విరమణ చేయక తప్పలేదు.

రాజ భవన ప్రాసాదంలో తర్వాత ఎలాంటి గొడవలు తలఎత్తలేదు.

పోలీసు పట్టునుంచి బయటపడిన పూజారికి దేవుడిపైన నమ్మకం ఏమాత్రం తగ్గలేదు ..అతని దైవ విశ్వాసం ద్విగుణీకృతమయింది. ఇప్పుడు పగలు మాత్రమే కాదు,రాత్రుళ్లు కూడా ఆయన శివాలయం దగ్గరే దైవధ్యానంలో నిమగ్నుడై కాలం గడుపుతున్నాడు.

కారుప్రమాదానికి ముందుగా, ఫ్రంటుసీటు వెనక నుంచి బుసకొట్టిన ఉరగం అక్కడే వున్నదా? లేక వున్నట్టుగా అంబికాభద్రయ్యలకు ఊరికే అనిపించిందా? అనే విషయం గురించి, ఆ పూజారికి కూడా ఏమీ తెలియదు. ఇంతకాలం దేవుడి పాదసేవ చేసిన, పోలీసు కుట్రలో చిక్కిపోయి పరితపించిన, ఈ రోజువరకు కూడా దివారాత్రాలు పూజాప్రార్థనల్లో గడిపిన ఆ పరమ భక్తుడి చెవిలో, ఆ త్రిలోచనుడు ఎందుకు ఆ పరమరహస్యం గురించి చెప్పలేదు?

---